స్లాట్ రద్దయినా.. డబ్బులు రాలే

భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన 'ధరణి' ఆదినుంచి అభాసుపాలవుతోంది. సాంకేతిక లోపాలు, అధికారుల పర్యవేక్షణ కరవై.. భూ క్రయవిక్రయాలు, ఆస్తుల బదలాయింపు, రిజిస్ట్రేషన్ సేవల్లో తీవ్రజాప్యం జరుగుతోందని రైతులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. స్లాట్ బుక్‌చేసుకొని రద్దుచేసుకుంటే తిరిగి రుసుము ఇవ్వడం లేదంటూ ఆవేదన చెందుతున్నారు.

- అర్జీ పెట్టుకున్నా.. తప్పని తిప్పలు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు



దౌల్తాబాద్: ధరణి పోర్టల్‌తో భూ క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని అనివార్య కారణాలతో స్లాట్ రద్దు చేసుకుంటే.. ప్రభుత్వానికి చెల్లించిన రుసుం తిరిగి ఇవ్వడం లేదని, ఆ డబ్బుల కోసం ఎదురుచూపులు తప్పడంలేదని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ భూములు, క్రయవిక్రయ లావాదేవీలు, వారసత్వంగా భూమి బదలాయింపులో పారదర్శత పెరిగి వివాదాలు తగ్గుతాయని భావించిన రాష్ట్ర ప్రభుత్వం.. 2020లో ధరణి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను అందుబాటులోకి తెచ్చింది. పై వాటిలో దేనికోసమైనా.. రైతులు మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. భూముల ధరలను బట్టి రిజిస్ట్రేషన్ ఫీజులు నిర్ణయించారు.

కార్యాలయాల చుట్టూ..

స్లాట్ బుకింగ్ చేసుకున్న కొందరు అనివార్య కారణాలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు వెళ్లలేకపోతున్నారు. తగాదాలు, ఆర్థిక వ్యవహారాలు ఇతర కారణాలతో బుక్ చేసుకున్న స్లాట్‌లు రద్దవుతుంటాయి. నిర్దేశించిన సమయంలో రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే మరలా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. స్లాట్ బుకింగ్ సమయంలో రైతులు తమ ఆధార్ నంబర్, బ్యాంక్ అకౌంట్ వివరాలు ఇవ్వాలి. స్లాట్ రద్దు చేసుకున్నందుకు మినహాయింపులు పోనూ మిగతా డబ్బును తిరిగి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. ధరణి ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు రద్దయిన స్లాట్లకు సంబంధించిన డబ్బులు తిరిగి రాలేదు. మండలంలో సుమారు 30 స్లాట్లు రద్దయ్యాయి. రూ.3లక్షలు నుంచి రూ.4లక్షల వరకు రావాల్సి ఉందని సమాచారం. డబ్బుల కోసం రైతులు నిత్యం రెవెన్యూ కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతుండగా.. నేరుగా ప్రభుత్వమే మీ బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని రైతులకు అధికారులు చెప్పి పంపిస్తున్నారు.

రూ.24వేలు రావాలి



నేను గ్రామంలో ఒక ఎకరా 10గుంటల భూమిని పట్టా చేసుకునేందుకు స్లాట్ బుక్ చేసుకున్నా. ఇందుకు ప్రభుత్వానికి రూ.24వేలు చెల్లించాను అయితే కొన్ని అనివార్య కారణాలతో స్లాట్‌ను రద్దు చేసుకున్నాను. డబ్బుల వాపస్ కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. స్లాట్ రద్దు చేసుకున్న రైతులకు డబ్బులు తిరిగి చెల్లించాలి. – గోపాల్, దౌల్తాబాద్

మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి



స్లాట్ రద్దు చేసుకున్నా.. వివిధ కారణాలతో రద్దయినా.. రైతులు మీసేవలో తిరిగి దరఖాస్తు పెట్టుకోవాలి. మీసేవ ద్వారా మాకు వస్తున్న దరఖాస్తులను పరిశీలించి, పై అధికారులకు పంపిస్తాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే వారివారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తాం. – కృష్ణయ్య, తహసీల్దార్

కంటి వెలుగు-ప్రగతికి వెలుగు

- పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

అనంతగిరి: కంటి వెలుగు-ప్రగతికి వెలుగు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు కంటి వెలుగు పథకం రూపుదిద్దుకుందని, ప్రతి ఒక్కరు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఈ మేరకు బుధవారం 'మీతో నేను' కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ మండలంలోని బురంతపల్లిలో పర్యటించి మాట్లాడారు. పరిపాలన సౌలభ్యం కోసం కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్‌కు.. ప్రజలంతా రుణపడి ఉంటారన్నారు. గ్రామంలో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి కృషి చేస్తానని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, పిచ్చి మొక్కలను తొలగించి, పల్లెప్రగతిలో చేయలేని పెండింగ్ పనులను పూర్తి చేయిస్తానని చెప్పారు. గ్రామంలో అవసరమైన చోట నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వీధి దీపాలు అమర్చాలని, అదే విధంగా పొలాల్లో వేలాడుతున్న తీగలను సరిచేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, సర్పంచ్ మమత, ఎంపీటీసీ నాగరాజు, ఏపీఓ శీను, పీఆర్ ఏఈ చాణిక్యరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాంరెడ్డి, ఆర్ఐ నరేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు గయాజ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నరసింహ

అనంతగిరి: టీయూటీఎఫ్ క్యాలెండర్, డైరీని బుధవారం కలెక్టరేట్‌లో సంచార, పాక్షిక సంచార వర్గాల అభివృద్ధి, సంక్షేమ బోర్డు జాతీయ సభ్యుడు తురుక నరసింహ ఆవిష్కరించారు. జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవ్యానాయక్, రాష్ట్ర బాధ్యులు గోపాల్, జాంప్లా, బస్వరాజు, దేవయ్య, సమియోద్దీన్, సంతోష్, సుధాకర్, శ్రీనివాస్, సునందం, బాలకృష్ణ, బాబు, నరేందర్, వెంకటయ్య, రెడ్యా రాథోడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వార్డుల సమస్యలు పరిష్కరిస్తా..

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: వార్డులన్నింటినీ అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం 1వ వార్డు మల్లెమోనిగూడలో పర్యటించి సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. త్వరలో తాగునీటి సమస్య, ప్రతి వీధికి అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సహకారంతో మున్సిపాలిటీకి అధిక నిధులు తీసుకొచ్చి మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో నాయకులు మౌలానా, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా అనూష



విధుల్లో చేరిన అనూష

యాలాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన వైద్యాధికారిగా తోటపల్లి అనూష బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ వైద్యాధికారిగా పనిచేసిన అశ్విని బదిలీపై మెదక్ వెళ్లారు. ఆమె స్థానంలో నగరం నుంచి యాలాలకు అనూష వైద్యాధికారిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

'పానాది'ని కాపాడండి

యాలాల: కబ్జా కోరల్లో చిక్కుకున్న పానాది బాటను రక్షించాలని బుధవారం దేవనూరు గ్రామస్తులు తహసీల్దార్ గోవిందమ్మకు వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 49,71,73,75లలో అసైన్డ్, ఇనాం, సీలింగ్ భూములున్నాయని చెప్పారు. అయితే ఈ సర్వే నంబర్‌లోని భూములను నగరానికి చెందిన చైతన్య అనే వ్యక్తి కొనుగోలు చేశాడని, ఈ ప్రాంతంలో దేవనూరు నుంచి యాలాలకు వెళ్లే దారిలో ఉన్న పానాది బాటను సైతం కబ్జా చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కబ్జా చేసిన భూమికి ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయడంతో దిగువన ఉన్న పట్టా భూముల్లోకి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని వాపోయారు. వెంటనే రెవెన్యూ అధికారులు పూర్తిగా సర్వే చేయించి, కబ్జాదారు నుంచి భూమి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం



యువతకు నగదు అందజేస్తున్న మేగ్యానాయక్

కుల్కచర్ల: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిన ఉల్లాసాన్ని పొందవచ్చని బీఆర్ఎస్ మండల యూత్‌వింగ్ అధ్యక్షుడు మేగ్యానాయక్ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండల పరిధిలోని కిష్టంపల్లి గ్రామంలో యువకులకు పరిగి ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి క్రికెట్ టోర్నీ నిర్వహణ నిమిత్తం రూ.15వేలు అందజేసి మాట్లాడారు. యువత క్రీడల్లో తమనైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని, తద్వారా భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

'ఎర్రవల్లి'కి అరుదైన అవకాశం

అనంతగిరి: వికారాబాద్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మండల కోఆప్షన్ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్ ఇటీవల పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరిగిన లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతుల్లో భాగంగా 60మంది నాయకులకు శిక్షణ ఇచ్చారు. అందులో రాష్ట్రంలోని ముగ్గురు నాయకుల్లో జాఫర్ ఒకరు. ఈ శిక్షణా తరగతులు దశలవారీగా కర్నాటక, మహారాష్ట్ర, హర్యానాలో 10 రోజుల పాటు జరిగాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఏఐసీసీ ట్రైనింగ్ ఇన్‌చార్జి నవీన్‌రావు, రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ చైర్మన్ మీనాక్షి నటరాజన్‌ల చేతుల మీదుగా జాఫర్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి

కొడంగల్ రూరల్: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణసింగ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు కంప్యూటర్‌ను బహుకరించి మాట్లాడారు. నిష్ణాతులైన ఉపాధ్యాయ సిబ్బందితో బోధన జరుగుతుందని, విద్యార్థులు గురువులు బోధించిన అంశాలతో జీవితంలో ఉన్నతంగా ఎదిగి, గ్రామానికి, పాఠశాలకు పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. అనంతరం సర్పంచు గీత మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో తోడ్పాటునిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లలిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

మర్పల్లి: సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన ప్రజా సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ బట్టు లలిత అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా మిషన్ భగీరథ తాగునీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ ఏఈని ఆదేశించారు. ముందుగా వ్యవసాయ శాఖ ఏఓ వసంత మాట్లాడుతుండగా తమ గ్రామాల్లో కొంత మందికి రైతుబంధు డబ్బులు రావడం లేదని సభ్యులు లేవనెత్తారు. రైతుబంధు రానివారు ఉంటే తమ ఏఈఓల వద్దకు వెళ్లి చెక్‌చేసుకోవాలని ఏఓ సమాధానం ఇచ్చారు. వానకాలంలో రైతులు సాగు చేసుకుంటున్న సాగు పెట్టుబడి సాయం ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమచేస్తుందన్నారు. కల్‌ఖోడ సబ్‌స్టేషన్ పనులు రెండు నెలల్లో పూర్తి అవుతాయని ఏఈ వెల్లడించగా.. జెడ్పీటీసీ మధుకర్ మాట్లాడుతూ.. పనులు వేగవంతం చేసి కల్‌ఖోడ ఫీడర్‌లో విద్యుత్ సమస్య లేకుండా చూడాలన్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ డీఈ మాట్లాడుతుండగా జెడ్పీటీసీ మధుకర్ మధ్యలో మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, మరమ్మతుల కోసం నిధులు మంజూరు అయినా.. పనులు ఎందుకు చేయడం లేదని ఆర్‌అండ్‌బీ డీఈపై అసహనం వ్యక్తం చేశారు. పనులు త్వరలో ప్రారంభించాలని మధుకర్ కోరారు. అంతకు ముందు శాఖల వారీగా సంబంధిత అధికారులు తమ ఎజెండా అంశాలను చదివి వినిపించగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు. సమావేశంలో రైతుబంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యులు సోయెల్, ఎంపీడీఓ మహేష్‌కుమార్, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి

కుల్కచర్ల: విద్యార్థి జీవితంలో పదో తరగతి అనేది అత్యంత కీలకమైందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీమెటీరియల్‌ను అందజేసి మాట్లాడారు. నిరుపేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందించనున్నామని చెప్పారు. విద్యార్థులకు సేవచేయడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా పది చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రూ.50వేలను ఎంఈఓ హబీబ్ అహ్మద్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నాగరాజు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మనఊరు' పనులు పూర్తి చేయాలి

మండల విద్యాధికారి హరిశ్చందర్



పనులకు భూమిపూజ చేస్తున్న ఎంఈఓ

దోమ: మనఊరు-మనబడి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంఈఓ హరిశ్చందర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గుండాల గ్రామంలో సర్పంచ్ సుజాతతో కలసి పాఠశాలలో నూతన తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, పాఠశాలలో చేసే పనులను కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బసయ్య, స్కూల్ చైర్మన్ పూర్ణయ్య, ప్రధానోపాధ్యాయుడు కేశవులు, గ్రామస్తులు జగత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలి



సర్వే చేస్తున్న విద్యాశాఖ అధికారులు

కుల్కచర్ల: బడీడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని ముజాహిద్‌పూర్ క్లస్టర్ సీఆర్పీ రాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పటేల్ చెరువుతండా జీపీ పరిధిలో డ్రాపౌట్స్ సర్వేలో భాగంగా ఓ విద్యార్థిని గుర్తించి తిరిగి అతన్ని పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల చదువు పట్ల నిర్లక్ష్యం చేయరాదని చెప్పారు. విద్యార్థులను చదువు విషయంలో దారితప్పిస్తే.. వారి జీవితంలో విలువైన సమయాన్ని కోల్పోతారని తెలిపారు. పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓంప్రకాష్, సిబ్బంది సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్



దోమ: సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని బాసుపల్లికి చెందిన తొంటశేఖర్ అనారోగ్యానికి గురై.. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోగా.. చికిత్స ఖర్చులు పెరిగాయి. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి కింద రూ. లక్ష మంజూరు చేయించారు. ఆ చెక్కును బాధిత కుటుంబానికి బుధవారం పరిగి పట్టణంలోని ఆయన నివాసంలో అందజేసి మాట్లాడారు. అనారోగ్యానికి గురైనవారు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు పద్మశ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల కోసం..

తాండూరు రూరల్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రుద్రారం గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామానికి చెందిన పద్మమ్మకు రూ.30 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే.. ప్రభుత్వం వారి వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ పంపిణీ చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కొడంగల్ రూరల్: పట్టణంలోని 2వ వార్డులో మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ బుధవారం సీసీరోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులను ప్రారంభించినట్లు చెప్పారు. సీసీ పనులను నాణ్యతతో చేపట్టాలని నిర్మాణదారుడికి సూచించారు. బీసీ కమ్యూనిటీ హాలు నుంచి ప్రధాన రహదారి వరకు సీసీ పనులు జరుగుతున్నాయని తెలిపారు.

నేడు కంటి వెలుగుపై అవగాహన

కొడంగల్: కంటి వెలుగు కార్యక్రమంపై గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ పాండు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగును విజయవంతం చేయడానికి సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు సహకరించాలని కోరారు.

యాలాలలో..

యాలాల: కంటివెలుగు కార్యక్రమ నిర్వహణపై నేడు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పుష్పలీల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ హాలులో ఉదయం 11 గంటలకు ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, అధికారులు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

తాండూరు రూరల్‌లో

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంపై నేడు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఎంపీపీ అనితగౌడ్ అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు ఉంటుందన్నారు. అదేవిధంగా 2023-2024కు సంబంధించిన యాక్షన్ ప్లాన్ కూడా నిర్వహిస్తామని చెప్పారు. కావున ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

పరిగి: సంక్రాంతి సెలవుల కారణంగా నేపథ్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని ఆర్టీసీ డీఎం పవిత్ర కోరారు. బుధవారం పరిగి డిపో ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే విద్యార్థులు సెలవుల నేపథ్యంలో విహారయాత్రలకు వెళ్లాల్సి ఉంటే ఆర్టీసీ సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. 40 మంది విద్యార్థులతో కూడిన బస్సులు పరిగి డిపో ఆవరణలో అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన వారు గంట ముందు సమాచారం ఇస్తే.. బస్సును పంపించేందుకు కృషి చేస్తామన్నారు. పూర్తి వివరాల కోసం ఈ కింది నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు. 7382838342 ,7382839193,9959225253.

సీసీ పనులు చేపట్టాలి

కొడంగల్ రూరల్: పట్టణంలోని 11వ వార్డులో సీసీరోడ్డు పనులు చేపట్టాలని మాజీ ఉప సర్పంచు ఎస్ఎం.గౌసన్ కోరారు. కాలనీలో రహదారులు గుంతలమయంగా మారాయని, మురుగుకాల్వలు లేక స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిస్తూ వెంటనే సీసీరోడ్లతో పాటు డ్రైనేజ్ పనులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



యాలాల: నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు



కుల్కచర్ల: డ్రంకెండ్‌డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్ఐ

యాలాల: శాంతి భద్రతల పరిరక్షణ కోసమే నాకాబందీ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ అరవింద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల పత్రాలు, లైసెన్సులను పరిశీలించారు. నాకాబందీలో మొత్తం 98 వాహనాలను తనిఖీ చేసి, సరైన పత్రాలు లేని 10 వాహనాలకు చలాన్లు విధించారు. ఒకరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుళ్లు అమృతమ్మ, అమృత, సందీప్‌గౌడ్, గోపాల్ ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

కుల్కచర్ల: మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్ఐ గిరి అన్నారు. మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు ధృవపత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. చలాన్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని, నంబర్ ప్లేట్లు క్లియర్‌గా కనిపించేలా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సత్యసీలారెడ్డి, స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కొడంగల్ రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని ఎస్ఐ రవిగౌడ్ సూచించారు. బుధవారం పట్టణశివారులోని చౌడేశ్వరీ మాత ఆలయం సమీపంలో రావులపల్లి రోడ్‌లో ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని, అతివేగం ప్రమాదమని, నంబర్‌ప్లేటు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీవారికి పొంగలి నైవేద్యం

విశేష అలంకరణలో శ్రీనివాసుడు



విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్: పద్మావతి సమేత మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారలకు బెల్లం పొంగలితో చేసిన ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు. ధనుర్మాసం 27వ రోజును పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేకంగా గుదారవల్లి పూజలు చేశారు. దేవేరుల సమేత శ్రీనివాసుడిని విశేషంగా అలంకరించారు. బుధవారం ఉదయం 6 గంటలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ధరూర్ శ్రీనివాసాచార్యులు తిరుప్పావై పారాయణం చదివి వినిపించారు. సంక్రాంతి సందర్భంగా ఈనెల 14న ఆలయ ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు గోదాదేవి కల్యాణోత్సవం, సాయంత్రం 4 గంటలకు తిరుచ్చి ఉత్సవం, 15న సాయంత్రం 4 గంటలకు శ్రీవారి ఉత్సవం, 16న పద్మావతి అమ్మవారికి ఉదయం 7 గంటలకు పుష్కరిణి వద్ద అలంకార తిరుమంజనం వైభవంగా చేయడానికి కృషి చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.



తిరుప్పావై వినిపిస్తున్న ఆచార్యులు